ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 27.0

ANDHRAJYOTHY
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శుక్రవారం 18 ఏప్రిల్ 2025



తనకల్లు మండలంలోని మారెవాండ్లపల్లిలో పొలంలోనే వదిలేసిన టమోటా

రైతు కష్టం పొలంలోనే..

- ధర పడిపోయిన టమోటా
- పొలాల్లోనే వదిలేస్తున్న రైతులు
- రూ. కోట్లలో పెట్టుబడి నష్టం

తనకల్లు మండలంలోని మారెవాండ్ల పల్లిలో పొలంలోనే వదిలేసిన టమోటా


గ్రేడింగ్ చేసిన టమోటాలు

తనకల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టమోటాలు కొనేవారు లేక రైతులు అల్లాడిపోతున్నారు. కొందరు పంటను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. టమాటాలు విక్రయించడానికి అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు, మదనపల్లి, కర్ణాటకలోని చింతామణి, వడ్డిపల్లి ప్రాంతాలు అనుకూలంగా ఉండటంతో పలువురు నియోజకవర్గ రైతులు టమాటా పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఏ సమయంలోనైనా రెండు వేల ఎకరాలకు తగ్గకుండా రైతులు ఏడాది పొడవున టమోటా సాగు చేస్తుంటారు. ఒక్కోసారి ఇది మూడు నాలుగింతలు పెరిగే అవకాశం ఉంది. ఎకరా టమోటా సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షలదాకా పెట్టుబడి పెడుతున్నారు. పంట దిగుబడి ఆశజనకంగా ఉండి మార్కెట్‌లో 30 కిలోల బాక్సు ధర రూ.నాలుగైదు వందలు పలికితే రైతుకు పెట్టుబడి పోను రూ. 40వేల నుంచి రూ. 50వేలు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో 30 కిలోల బాక్స్ రూ.80తో ప్రారంభమై రూ.150దాకా పలుకుతుంది. మేలురకం కాయలు రూ.రెండువందలు పలుకుతున్నాయి. దీంతో టమోటాలు కొసిన కూలీలకు కూడా రైతే చేతి నుంచి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకే రైతులు పొలాల్లోనే టమాటలను వదిలేస్తున్నారు.

రూ.20 కోట్ల పెట్టుబడి నష్టం

తనకల్లు మండలంలో ఐదువందల ఎకరాలు, నల్లచెరువు ఐదువందలు, గాండ్లపెంట ఐదు వందలు, నంబులపూలకుంట నాలుగువందలు, తలుపుల రెండువందలు, కదిరి రూరల్ వంద ఎకరాలదాకా టమాటా పంట సాగులో ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం రెండువేల ఎకరాల సాగు కోసం రైతులు రూ.20కోట్ల పెట్టుబడి పెట్టారు. ఈ సీజన్‌లో ఈ పెట్టుబడి మొత్తం నష్టం జరిగినట్లు రైతులు లెక్కలేస్తున్నారు. ఈప్రాంతంలో టమాటకు ధరలు లేనప్పుడు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాట్లు ద్వారా రైతులకు ధరలు కల్పించడానికి అవకాశముందని రైతులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాలు గంగోలు పెడుతున్నా, పట్టించుకునే నాథుడే లేడు.

ప్రతిపాదనలు పంపుతాం

గతంలో కేంద్ర ప్రభుత్వం తనకల్లు మండలానికి టమోట ప్రైమరీ ప్రాసిసింగ్ యూనిట్‌ను మంజూరు చేసింది. నిర్మాణంలో జాప్యం కారణంగా ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం కేంద్రానికి టమోటా ప్రాసిసింగ్ యూనిట్ల కోసం ప్రతిపాదనలు పంపుతాం.

- అజయ్‌కుమార్, ఏపీ ఫుడ్ ప్రాసిసింగ్ అధికారి

రూ.3లక్షలు నష్టపోయా


రెండు ఎకరాల్లో టమాట సాగు చేశా. ఎకరాకు రూ.ఒకటిన్నర లక్షల దాకా ఖర్చు చేశా. పంట దిగుబడి సాధించా. మార్కెట్‌కు తీసుకెళ్లితే 30కేజీల బాక్స్ రూ. 150లకు అడిగితే ఏమి చేయాలి. కూలీలు, రవాణా చార్జీలు, కమీషన్లు ఎక్కడి నుంచి తెచ్చి ఇవాలి? అందుకే పొలంలోనే వదిలేశా. ప్రస్తుతం జ్యూస్‌కోసం బాక్స్ రూ.40లతో అమ్మేస్తున్నా.

-దీప్లానాయక్, నక్కరాళ్లతండా

అడిగేదెవరు..?

సచివాలయ ఉద్యోగుల తీరుతో జనం బేజారు

- విధులకు డుమ్మా కొడుతున్నా పట్టించుకోని అధికారులు
- సిబ్బంది లేక అప్పుడప్పుడు సచివాలయాల మూసివేత
- ప్రజలకు అందని సేవలు


కురమామిడి సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు (ఫైల్)

గాండ్లపెంట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల తీరుతో గ్రామీణ ప్రజలకు పలు రకాల సేవలు అందకుండాపోతున్నాయి. మండలంలో 14 పంచాయతీలు ఉండగా గాండ్లపెంట, కటారుపల్లి, సోమయాజులపల్లి, కురమామిడి, మల్లమీదపల్లి, తుమ్మలబైలు, గొడ్డివెలగలలో సచివాలయాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులు విధుల్లో ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి. దీంతో వారాలు, నెలలు గడిచినా ప్రజలు కోరిన సేవలు అందని పరిస్థితి నెలకొంది. సచివాలయాల్లో వివిధ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోవడంతో, లబ్ధిదారులే నేరుగా మండలకేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లి చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొంతమంది ఉద్యోగులు, వారం, పదిరోజులు, నెలలు పాటు గైరుహాజరైనా వారిపై పర్యవేక్షణచేసే అధికారే లేరని ప్రజలంటున్నారు. అధికారులు రాకపోవడంతో గత నెల 20న గొడ్డివెలగల సచివాలయాన్ని మూసివేశారు. ఉద్యోగులు విధులకు హాజరుకాక పోవడంతో గత నెల 24న కురమామిడి సచివాలయంలో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, రైతు భరోసా కేంద్రం అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో ఉన్నామంటూ కొద్ది రోజులు కార్యాలయాన్నే మూసివేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా సచివాలయ ఉద్యోగుల తీరు మారకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే వీరు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అలా వచ్చి.. ఇలా వెళ్లిపోతారు..

సచివాలయ ఉద్యోగులు ఉదయమే వచ్చి బయోమెట్రిక్ హాజరు వేసి వెళ్లిపోతారు. గ్రామాల్లో వివిధ రకాల సర్వేలు, పనులున్నాయంటే కార్యాలయం నుంచి వెళ్తున్నారు. అయితే వారంతా సొంత పనుల మీద విధుకు డుమ్మా కొట్టి బయటకు వెళ్తున్నట్లు విమర్శలున్నాయి. దీంతో ఆ సచివాలయ ఉద్యోగి సేవలన్నీ కుంటుపడుతున్నాయి. దీంతో విధిలేని పరిస్థితిలో మీసేవ కేంద్రాలను ఆశ్రయించాల్సిన దుస్థితి.

పలు పంచాయతీలకు ఇన్‌చార్జ్ కార్యదర్శులు

మండలంలో పలు పంచాయతీలకు ఇన్‌చార్జ్ కార్యదర్శులు పని చేస్తున్నారు. దీంతో సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమయాజులపల్లి కార్యదర్శి బాషా గాండ్లపెంట, తూపల్లికి ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. మల్లమీదపల్లి కార్యదర్శి వసుంధర కురమామిడికి, వేపరాల కార్యదర్శి శ్యామ్‌కుమార్ కటారుపల్లి, జీన్లకుంటకు ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఏ పంచాయతీలో ఏ కార్యదర్శి ఎప్పుడు విధుల్లో ఉంటారో.. సెలవులో ఉంటారో తెలియని పరిస్థితి. సచివాలయ సిబ్బంది దీర్ఘకాలిక సెలవుపై ఉన్నారు. వేసవిలో పలు గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తే అవకాశముంది. పనులు పరిశీలించాల్సిన అధికారులు ఇన్‌చార్జ్ హోదాలో ఏగ్రామానికి వెళ్లాలో తెలియడం లేదంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ కార్యదర్శులను నియమించి ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

● మండలంలోని సచివాలయాలను పర్యవేక్షిస్తామని ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిని పర్యవేక్షించి, గైర్హాజరవుతున్న అధికారులపై చర్యలు చేపడతామన్నారు.

వ్యవసాయానికి వెలుగులు

- రైతులకు తీరనున్న కరెంటు కష్టాలు
- కొత్తగా నాలుగు సబ్‌స్టేషన్ల నిర్మాణం
- నేడు ప్రారంభోత్సవం
- మరో మూడింటి నిర్మాణానికి భూమిపూజ
- అన్నదాతల ఆనందం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కదిరేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్

మడకశిర రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నీటి వనరులే తక్కువ. భూగర్భ జలమట్టాలు దారుణంగా ఉంటాయి. బోరుబావుల కింద తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తుంటారు. విద్యుత్ సరఫరాలో సమస్యలతో ఆ పంటలు కూడా రైతులకు చేతికందట్లేదు. దీంతో విద్యుత్ సరఫరాలో నీరు అందక, పంటలు ఎండిపోయి దిగుబడులు రాక అన్నదాతలు నష్టపోతున్నారు. ఈ సమస్యలను గుర్తించిన కొత్త ప్రభుత్వం వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలో ఒక్కసారిగా నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టింది. త్వరితగతిన పూర్తి చేసింది. మరో మూడు సబ్ స్టేషన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. మడకశిర మండలంలోని వైబీ హళ్ళి, కదిరేపల్లి, అమరాపురం మండలంలోని పి. శివరం, అగళి మండలంలోని ఇనగలూరులో నూతన సబ్ స్టేషన్లు నిర్మించారు. వాటిని శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రారంభించనున్నారు. మడకశిర మండలం గుండుమల, గుడిబండ మండలం కేకే పాళ్యం, రొళ్ళ మండలంలోని రంగనపల్లి గ్రామాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు.

రైతు కళ్లలో ఆనందం

వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు లేకుండా సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవం, కొత్తవాటి నిర్మాణానికి భూమిపూజ చేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైబీ హళ్ళి సబ్ స్టేషన్ పరిధిలో వైబీ హళ్ళిబుడ్డేపాళ్యం, కోనప్పపాళ్యం, జుర్రపల్లి, కరేసంకనహళ్ళి, భక్తరహళ్ళి, ఉపార్లపల్లి, డొడ్డేపల్లి గ్రామాలున్నాయి. కదిరేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గుర్రపుకొండ, పాపసానిపల్లి, కంబాలపల్లి ముదిగుబ్బ, ఉగ్రేపల్లి, కేకేపాళ్యం, కోడిగానిల్లి, మొళవాయి. బేగార్లపల్లి ఉన్నాయి. ఆయా గ్రామాల్లో విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. రైతుల బాధలు తప్పించేందుకు మండలంలో సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తిచేశారు. శుక్రవారం వాటిని ప్రారంభించనుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడులు వచ్చేవి కావు


అప్పులు చేసి సాగు చేసిన పంటలు.. విద్యుత్ కోతల వల్ల సకాలంలో నీరు అందక ఎండుతుండేవి. సరిగా దిగుబడులు వచ్చేవి కాదు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో వోల్టేజీ సమస్య తీరనుంది. పంటలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తప్పనున్నాయి.

-ప్రసాద్, రైతు, బుడ్డేపాళ్యం గ్రామం

రూ.16 కోట్లతో నిర్మాణం

వైబీహళ్ళి, కదిరేపల్లి, పి శివరం, ఇనగలూరులో మొత్తం రూ.16 కోట్ల వ్యయంతో సబ్‌స్టేషన్లు నిర్మించాం. దీంతో వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు తలెత్తవు.

-విశ్వనాథ్, విద్యుత్ ఏఈ, మడకశిర

కుళ్లిపోతున్న శవాలు..!

- మార్చురీలో ఫ్రీజర్లు కరువు
- నేలపైనే మృతదేహాలు
- ఎలుకలు, చీమలు తిన్నా పట్టించుకునే వారేరీ..?
- 'పురం' ఆసుపత్రిలో దయనీయం



శిథిలావస్థకు చేరుకున్న మార్చురీ గది

హిందూపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పంచనామా నిమిత్తం నిత్యం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి శవాలను తీసుకు వస్తుంటారు. కొన్ని సందర్భాల్లో రెండు మూడు రోజులు మార్చురీలో పెట్టాల్సి వస్తుంది. ఒకేసారి రెండు మూడు మృతదేహాలు వస్తే నేలపైనే ఉంచాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. దశాబ్దాల క్రితమే జిల్లా ఆసుపత్రిగా పేరు గాంచింది. ప్రస్తుతం నూతన జిల్లా ఏర్పడ్డాక ఇక్కడికే అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఇలాంటి ఆసుపత్రిలో మార్చురీ గది లేకపోవడం దారుణం. కొన్నేళ్ల క్రితం నిర్మించిన మార్చురీ గది శిథిలావస్థకు చేరుకుంది. దీంతో దాని పక్కన ఉన్న దోబీకి కేటాయించిన చిన్నపాటి గదిలో శవాలను ఉంచుతున్నారు. ఇప్పటి వరకు ఫ్రీజర్లు ఏర్పాటు చేయలేదు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోకి లేపాక్షి చిలమత్తూరు, పరిగితో పాటు కొన్ని సందర్భాల్లో మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని మృతదేహాలను సైతం ఇక్కడికే తరలిస్తారు.

అధ్వాన్నంగా మార్చురీ

హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి రోజూ ఒకటి రెండు మృతదేహాలు వస్తూనే ఉంటాయి. కొన్ని సందర్భాల్లో మూడు నాలుగు కూడా వస్తుంటాయి. ఇందులో ఆత్మహత్యలు చేసుకున్న వారు, అనాథ శవాలు, రోడ్డు ప్రమాదాలు, ఎంఎల్‌సీ, నాన్ ఎంఎల్‌సీ కేసుల్లో మృతదేహాలు మార్చురీకి తరలిస్తారు. నెలలో కనీసం ఐదారుగురు రైలు కింద పడి మృతి చెందుతుంటారు. ఇందులో అధిక శాతం గుర్తుతెలియని వారే ఉంటారు. మార్చురీలో శవాలను భద్రపర్చడానికి వసతి లేదు, అంతకు మించి ఫ్రీజరు లేదు. దీని వల్ల కొన్ని సందర్భాల్లో గుర్తుతెలియని మృతదేహాలను గుర్తించకనే అనాథ శవాలుగా ఖననం చేయాల్సిన పరిస్థితి వస్తోంది. మార్చురీ గది ఓ మూలకు ఉంది. దీంతో అక్కడ చెత్తా చెదారం పేరుకుపోయి కంపచెట్లు ఉన్నాయి. దీని వల్ల మృతదేహాలను నేలపై ఉంచితే చీమలు, ఎలుకలు తిన్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడని మృతుల బంధువులు ఆవేదన చెందుతున్నారు.


మార్చురీలో నేలపై ఉంచిన మృతదేహం

నూతన మార్చురీ గది నిర్మిస్తేనే..

ఏదైనా అనుకోని పరిస్థితులు, రోడ్డు ప్రమాదాల్లో, ఇతర కారణాలతో ఎంతటి వారు మరణించినా ఇక్కడ ఇదే గదిలో ఉంచాలి. మృతదేహాలను ఖననం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సుదూర ప్రాంతాల్లోని బంధువులు రావడానికి ఆలస్యమైతే అంతవరకు మృతదేహాన్ని భద్రపర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఇంత పెద్ద ఆసుపత్రిలో మృతదేహాలను భద్రపర్చడానికి గది లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి బంధువులు వచ్చేసరికి మృతదేహం గుర్తుపట్టలేనంతగా మారిపోతోంది. స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ నూతన మార్చురీ గది నిర్మాణానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నివేదికలు పంపాం

ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ గది నిర్మాణం కోసం నివేదికలు పంపాం. కొత్త మార్చురీ గదితో పాటు ఫ్రీజర్లు కూడా కావాలని ఉన్నతాధికారులకు నివేదించాం. స్థానిక ఎమ్మెల్యే ద్వారా నిధులు తొందర్లోనే వస్తాయి.

- డాక్టర్ లింగన్న, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, హిందూపురం

దర్యాప్తు వేగవంతం చేయండి: ఎస్పీ


డీఎస్పీలతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పోక్సో, లాంగ్ పెండింగ్, సోషల్ మీడియా కేసుల గురించి జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలతో ఎస్పీ రత్న సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. మహిళల కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని, స్టేషన్లకు వచ్చే మహిళలతో సభ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, హేమంత్‌కుమార్, శివన్నారాయణ, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

● జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలని పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గురువారం జిల్లాలో విస్తృతంగా వాహనా తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి, వాహన రికార్డులు లేనివారికి జరిమానా విధించారు. అటవీ ప్రాంతాలు, నిర్జన ప్రదేశాలలో నేర నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో గాలించారు.

వందశాతం లక్ష్యాలు

పూర్తి చేయాలి

జిల్లా అధికారులతో సీఎస్ విజయానంద్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా అధికారులను ఆదేశించారు. విజయవాడలోని సచివాలయం నుంచి వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా గురువారం ఆయన కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న, జేసీ అభిషేక్ కుమార్, ఇతర జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సోలార్ ప్రాజెక్టులకు భూ సేకరణ, తాగునీటి సరఫరా, ఉచిత ఇసుక, స్వచ్ఛంధ్ర తదితర అంశాలపై జిల్లా అధికారులతో సీఎస్ సమీక్షించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పశువుల దాహార్తి తీర్చడానికి నిర్మిస్తున్న నీటి తొట్టిలను త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో సోలార్ ప్రాజెక్టుల నిర్మాణానికి భూసేకరణ పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. మూడో శనివారం స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించాలన్నారు. ఉచిత ఇసుక సరఫరాలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి, సానుకూల దృక్పథం పెంపొందించాలని అధికారులను ఆదేశించారు.

నేడు మడకశిరకు నలుగురు మంత్రుల రాక

జిల్లాలోని మడకశిర నియోజకవర్గంలో రూ. నాలుగు కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభానికి శుక్రవారం నలుగురు మంత్రులు వస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ గురువారం ఓప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లాకు చెందిన మంత్రులు సత్యకుమార్‌యాదవ్, సవిత రానున్నట్లు ఆయన వెల్లడించారు.



చీనీ కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కొనేవారు కరువు..

ఆశాజనకంగా చీనీ దిగుబడులు

పాతాళానికి పడిపోయిన ధరలు


కొనడానికి ముందుకురాని వ్యాపారులు

మొహం చాటేస్తున్న వైనం

అన్నదాతల్లో ఆందోళన

కూడేరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కూడేరు, గార్లదిన్నె, రాప్తాడు, తాడిపత్రి, పామిడి, ఆత్మకూరు, శింగనమల తదితర మండలాల్లో దాదాపు 95 వేల ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. అత్యధికంగా కూడేరు, గార్నదిన్నె మండలాల్లో ఏకంగా 30 వేల ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. జిల్లాలో ఐదారేళ్లుగా చీనీ పంటకు ఆశించిన ధరలు ఉంటుండడంతో వ్యాపారులు తోటల వద్దనే కాయలను కొనుగోలు చేశారు. ఈ ఏడాది చీనీ పంటకు ఎకరాకు లక్షకుపైగా అప్పు చేసి, పెట్టుబడులు పెట్టారు. దిగుబడి ఆశాజనంగా రావడంతో ధర బాగా పలికితే అప్పుల నుంచి బయట పడతామని అన్నదాతలు ఆశించారు. మార్కెట్‌లో ధర పతనం కావడంతో ఊహించని షాక్ తగిలింది. పది టన్నులకు రెండు టన్నుల సూట్‌తో చీనీ టన్ను ధర రూ.25 వేలలోపే పలుకుతోంది. గతేడాది రంజాన్ పండుగ తర్వాత ఏప్రిల్, మే నెలల్లో టన్ను చీనీ రూ.38 వేల నుంచి రూ.45 వేల వరకు ధర పలికింది. దీంతో చీనీ వ్యాపారులు కాయలు కొనడానికి తోటల వద్దకు క్యూ కట్టారు. ఈ ఏడాది రంజాన్ పండుగ దాటినా వ్యాపారులు చీనీతోటల వైపు కన్నెత్తి చూడకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది.

అన్నదాతలు లక్షల రూపాయల అప్పులు చేసి, చీనీ సాగు చేశారు. ఏళ్లపాటు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. మొదట్లో ధర అంతగా లేదు. ఉగాది, రంజాన్ పండుగల వేళ పెరుగుతుందని అన్నదాతలు ఆశగా ఎదురుచూశారు. పంటను కోయకుండా అలాగే ఉంచారు. పండుగలు వెళ్లిపోయాయి. ధరలు మాత్రం పెరగలేదు. మరింత పడిపోయాయి. టన్ను రూ.25 వేలు కూడా ధర పలకట్లేదు. ఆ ధరకే అమ్ముదామనుకున్నా.. వ్యాపారులు రావట్లేదు. సాధారణంగా తోటల చుట్టూ తిరిగే వ్యాపారులు ఈసారి కనిపించట్లేదు. దీంతో రైతులే.. వ్యాపారుల వద్దకెళ్తున్నారు. కోస్తామని చెప్పిన వ్యాపారులు సైతం తరువాత మొహం చాటేస్తున్నారు. ఫోన్లు చేస్తున్నా.. వ్యాపారులు అందుబాటులోకి రావట్లేదని రైతులు వాపోతున్నారు. పంటను ఎలా అమ్ముకోవాలో దిక్కుతోచక అన్నదాతలు అయోమయంలో పడ్డారు. దీనికితోడు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చీనీ కాయలు రంగు మారుతున్నాయి. ఇది అన్నదాతల్లో మరింత ఆందోళన రేపుతోంది.


విరగ్గాసిన చీనీ

రంగు మారుతున్న కాయలు

బోరు నీటితో సాధారణంగా చీనీ కాయలు రంగు మారడానికి చాలా సమయం పడుతుంది. వర్షపు నీటికి త్వరగా కలర్ మారిపోతాయి. ఈ ఏడాది అకాల వర్షాల ప్రభావం చీనీ కాయలపై కూడా పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు కాయలు కలర్ మారడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చెట్లపైనే కాయలు కలర్ మారుతుండటంతో ఎక్కువ రోజులు కాయలు పెట్టుకునే పరిస్థితి లేదు. చీనీ కాయలను కొనుగోలు చేసే వ్యాపారులు రాకపోవడంతో తోటల్లో ఎక్కడ చూసినా కాయలు కనిపిస్తున్నాయి.

నాటి వైభవం ఏదీ..?

జిల్లాలోనే కూడేరు, గార్నదిన్నె మండలాలు చీనీ సాగుకు ప్రసిద్ధి. కాయలు కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఈ మండలాల్లో తిష్ట వేసేవారు. ఇక్కడే ఇళ్లు అద్దెకు తీసుకుని, ఉండేవారు. ఐదారేళ్ల క్రితం కర్నూలు జిల్లా సిరివెళ్లి ప్రాంతం నుంచి చీనీ వ్యాపారులు అధికంగా వచ్చేవారు. దీంతో వ్యాపారులు గ్రామాల్లో నిత్యం జీపులు, ద్విచక్రవాహనాల్లో తిరుగుతూ కాయల కోసం పోటీ పడేవారు. తోటల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వ్యాపారుల చుట్టూ రైతులు తిరిగే దుస్థితి దాపురించింది. రోజురోజుకీ చీనీ ధర పతనం అవుతుండడంతో కాయలు కొన్న వ్యాపారులు సైతం కోయడానికి మొహం చాటేస్తున్నారు. దీంతో అన్నదాతలు కాయలు కొన్న వ్యాపారి కోసం పలుసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు. గతంలో చీనీకాయల కోసం తోటల వద్దకు వ్యాపారులు క్యూ కడితే... ఈసారి వారి చుట్టూ రైతులు తిరిగే పరిస్థితి ఏర్పడింది.


వర్షానికి రంగుమారిన చీనీ కాయలను చూపుతున్న రైతు ఎద్దుల సుధాకర్

తీవ్రంగా నష్టపోతున్నాం



మూడెకరాల్లో 430 చీనీ చెట్లు సాగు చేశా. రూ.3.5 లక్షల వరకు పెట్టుబడులు పెట్టా. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో అప్పుల నుంచి గట్టెక్కుతామని ఆనందపడ్డా. ధర పతనం కావడంతో షాక్‌కు లోనయ్యా. కాయలు కోత దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ధర రూ.25 వేలు కూడా పలకట్లేదు. కొనడానికి వ్యాపారులు కూడా ముందుకు రావట్లేదు. చీనీ సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నాం. మద్దతు ధరతో ప్రభుత్వమే చీనీ కాయలు కొనుగోలు చేయాలి.

- జీడిపల్లి హనుమంతు, చీనీ రైతు, అంతరగంగ, కూడేరు మండలం

దిక్కుతోచని స్థితి..



ఆరెకరాల్లో 900 చీనీ చెట్లు సాగు చేశా. రూ.8 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగుండటంతో ధర దక్కితే అప్పులు తీరిపోతాయనుకున్నా. ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నా. అకాల వర్షాలు ఆందోళన రేపుతున్నాయి. ఈ ఏడాది చీనీ రైతుల కష్టాలు వర్ణనాతీతం.

- కోనంకి జయరాం, చీనీ రైతు, గొటుకూరు, కూడేరు మండలం

ఉజ్వల భవితకు పాలిసెట్


పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగాల విషయంలో బీటెక్ వారికంటే పాలిటెక్నిక్ విద్యార్థులకే ప్రాధాన్యం ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ సెక్టార్‌లోను పాలిటెక్నిక్ వారికే పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఇప్పటికే పాలిసెట్‌కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పాలిసెట్ కన్వీనర్ సురేష్‌బాబు తెలియచేశారు. జిల్లాలో పాలిసెట్ పరీక్ష హిందూపురం, ధర్మవరం, కదిరి, పాలిటెక్నిక్ కళాశాలల్లో జరుగనుంది. పాలిసెట్‌కు జిల్లావ్యాప్తంగా దాదాపు 5వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో నాలుగు ప్రభుత్వ, ఒక ప్రైవేట్ కళాశాల ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి, పుట్టపర్తిరూరల్/కొత్తచెరువు

- ఈనెల 30న ప్రవేశ పరీక్ష
- పాలిటెక్నిక్‌తో త్వరగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

పాలిటెక్నిక్‌లో ప్రవేశం ఇలా...

ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సు చదివిన విద్యార్థులు, బ్రిడ్జి కోర్సు అర్హత సాధించివారు నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు. ఐటీఐ ట్రేడ్‌లో 60శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు బ్రిడ్జి కోర్సు ద్వారా నిర్వహించే అర్హత పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. ఈపరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ద్వితీయ ఏడాది, పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులలో అడ్మిషన్ పొందవచ్చు. ప్రస్తుతం పదోతరగతి రాసిన విద్యార్థులు, ఇదివరకే పదో తరగతి పూర్తి చేసిన వారు పాలిసెట్ రాసి మెరుగైన ర్యాంకులతో కళాశాలల్లో చేరవచ్చు.



చక్కటి ఉపాధి



డిప్లొమా కోర్సులతో చక్కటి ఉపాధి లభిస్తుంది. వివిధ సంస్థలు డిప్లొమా పూర్తి చేసిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. జీవితంలో త్వరగా స్థిరపడటానికి పాలిటెక్నిక్ సరైన మార్గం. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇదో మంచి అవకాశం. డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం, ఉపాధి పొందవచ్చు.

- సురేష్‌బాబు, శ్రీ సత్యసాయిజిల్లా పాలిసెట్ కన్వీనర్

ఉక్కపోత.. రోగాల మోత

- చిన్నారులకు ఆటలమ్మ, గవదబిళ్లలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

కొత్తచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వేసవికాలం వచ్చిందంటే చాలు కొంతమందికి అనారోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. ముఖ్యంగా చిన్నారుల్లో ఆటలమ్మ, గవదబిళ్లలు (చికన్‌ఫాక్స్) సోకుతుంటాయి. మండలంలోని చాలా గ్రామాల్లో ఆటలమ్మ, గవదబిళ్లలు కేసులు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిబారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా వాపు, నొప్పి తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయసుల వారికి ఈ అంటువ్యాధి వ్యారిసెల్లా అనే వైరస్ వల్ల సోకే అవకాశం ఉంది. చిన్నారుల్లో ఎక్కువగా వస్తుంటుంది. అంటువ్యాధులు సోకకుండా 9 నెలల వయసులోనే చిన్నారులకు టీకా వేస్తామని కొత్తచెరువు సీహెచ్‌సీ వైద్యాధికారి అశ్వర్థకుమార్ తెలిపారు. ముందు జాగ్రత్తలు, అప్రమత్తతతో వ్యవహరిస్తే రక్షణ పొందవచ్చునని సూచిస్తున్నారు.

ఆటలమ్మ, గవద బిళ్లల లక్షణాలు

సాధారణంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. చిన్నారులు బలవర్ధకమైన ఆహారం తీసుకొనేలా తల్లిదండ్రులు శ్రద్ధచూపాలి. ఆటలమ్మ, గవదబిళ్లలు సోకినవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి మందగించడం, ఆహారం సరిగా తీసుకోలేకపోవడం వల్ల తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మ, గవదబిళ్లలుగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రత ఆధారంగా వైద్యుల సలహా మేరకు యాంటీ బయోటిక్, యాంటీ వైరస్ మందులు వాడాల్సి ఉంటుంది.



ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఆటలమ్మ, గవదబిళ్లలు సోకినవారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు ఇవ్వాలి. గవదబిళ్లలు వచ్చిన వారికి గొంతు నొప్పి తీవ్రంగా ఉంటుంది. తరచూ ద్రవపదార్థాలు తీసుకోవాలి. ఆటలమ్మ, గవదబిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢనమ్మకాలతో వైద్యుల సలహా తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

నిర్లక్ష్యం తగదు



ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్షం తగదు. చిన్నారులు ఎక్కువగా ఈ వ్యాధుల బారినపడుతుంటారు. వ్యాధి లక్షణాలు కనిపించగానే డాక్టర్‌ను సంప్రదించి వారి సూచన మేరకు మందులు వాడాలి.

- డాక్టర్ అశ్వత్థకుమార్, సీహెచ్‌సీ వైద్యాధికారి, కొత్తచెరువు

ఏపీజీఈఏ సంఘం ఒక్కటే

డూప్లికేట్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీజీఈఏ) ఒక్కటే ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ స్పష్టం చేశారు. సంఘం పేరుతో చలామణి అవుతున్న కొందరు డూప్లికేట్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 15న ఏపీజీఈఓ సంఘమంటూ ఇదివరకే సంఘం నుంచి తొలగించిన శ్రీకాంత్ రాజు, ఆస్కార్‌రావులు, జిల్లా నాయకులుగా పాల్గొన్న రమణకుమార్‌లు తమ సంఘం నేతలపై అవాకులుచవాకులు పేలడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై పోరాటం చేస్తూ జీతాల చెల్లింపులు చట్టబద్ధం చేయాలని తదితర వాటిపై పోరాటం చేసిన నాయకుడు కేఆర్. సూర్యనారాయణ అన్నారు. అలాంటి నేతపై ఆస్కార్‌రావు, శ్రీకాంత్‌రాజు, రమణకుమార్‌లకు విమర్శలు చేసే అర్హత లేదన్నారు. గతంలో ఏపీజీఈఏ సంఘంలో అక్రమాలకు పాల్పడటంతో పాటు సంఘం పేరు, లోగో, లెటర్‌పాడ్స్‌ను దుర్వినియోగపరుస్తూ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉద్యోగులను మోసం చేసిన చరిత్ర శ్రీకాంత్ రాజు, ఆస్కార్‌రావులదన్నారు. వారిపై విజయవాడ లోని భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నెం. 14/2025 క్రిమినల్ కేసు నమోదైందన్నారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు వేణుగోపాల్, మహిళా అధ్యక్షురాలు సాంబశివమ్మ, నగర అధ్యక్షులు షేక్ రఫీ, నాయకులు వినోద్, తిమ్మరాజు, నాగేశ్వరయ్య, నాగరాజు, ఈశ్వరయ్య, శ్రీరాములు, హనుమంతు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోపీకృష్ణ

1 నుంచి వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు

కొత్తచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయభాస్కర్ గురువారం ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు, విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, ఫుట్‌బాల్, హాకీ, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. కోచ్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల ప్రభుత్వ, ప్రైవేటు పీఈటీలు, పీడీలు, క్రీడా వికాస కేంద్రాల శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, ఔత్సాహికులు ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని డీఎస్‌డీఓ తెలిపారు. వివరాలకు 9849421462 నంబరులో సంప్రదించాలన్నారు.

దళిత రైతులకు దగా

రీ సర్వేలో భూములు మాయం

దేవదాయ, ప్రభుత్వ భూములుగా మార్పు

20 ఏళ్ల క్రితం పంపిణీ చేసిన టీడీపీ ప్రభుత్వం

తహసీల్దారు కార్యాలయం చుట్టూ బాధితుల ప్రదక్షిణ


దళిత మహిళలకు ఇచ్చిన భూమి

విడపనకల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దళిత మహిళా రైతులకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. రెండు దశాబ్దాల క్రితం వారికి పంపిణీ చేసిన భూములను వారికి కాకుండా చేసింది. రీసర్వే పేరుతో విడపనకల్లు మండలంలో 200 ఎకరాలకు పైగా భూములను ఆన్‌లైన్‌లో దేవదాయ, ప్రభుత్వ భూములుగా మార్చేసింది. దీంతో బాధిత రైతులకు పంట రుణాలు, ప్రభుత్వ పథకాలూ అందడం లేదు. 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒక్కో దళిత మహిళకు ఎకరం నుంచి రెండెకరాల వరకూ సాగు భూమిని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి, పంపిణీ చేసింది. పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఇచ్చింది. భూ కొనుగోలు పథకం కింద మాగాణి అయితే ఎకరం, బయలు పొలం అయితే రెండెకరాల ప్రకారం 360మందికి పంపిణీ చేశారు. ఈ భూములపై పంట రుణాలను కూడా రైతులు తీసుకున్నారు.

వైసీపీ హయాంలో..

రీ సర్వేతో 43, 288ఏ, 46, 219, 52 సర్వే నంబర్లలోని 200 ఎకరాలకుపైగా రైతుల పొలాలను దేవదాయ, ప్రభుత్వ భూములుగా మార్చేశారు. పాత రికార్డుల ప్రకారం భూమి ఏ స్వరూపంలో ఉంటే అలాగే చూపించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. దీంతో దేవదాయ భూమిని లబ్ధిదారుల పేరిట మార్చేందుకు వీలులేకుండా పోయిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు లేక పోవటంతో బాధిత రైతులు బ్యాంకుల్లో పంట రుణాలను రెన్యూవల్ చేయించుకోలేకపోతున్నారు. ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఆన్‌లైన్‌లో వన్‌బీ, అడంగల్ వచ్చేలా చూడాలని పట్టాదారు పాసుపుస్తకాలను పట్టుకుని బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఏ అధికారీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నా పేరు లేకుండా చేశారు...



సర్వే నంబరు 43లో నాకు ఎకరం మాగాణి భూమిని 20 ఏళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చింది. అప్పుడే నాకు పాసుపుస్తకం ఇచ్చారు. రీ సర్వేలో దేవాలయ భూమిగా మార్చేశారు. పాసుపుస్తకాల్లో నాపేరు ఉంది. కంప్యూటర్‌లో మాత్రం రావటం లేదు. వన్‌బీ, అడంగల్ ఇవ్వడంలేదు.

- గంగమ్మ, రైతు, కరకముక్కల

రీ సర్వేలో మార్చేశారు..



సర్వే నంబరు 288ఏలో నాకు రెండెకకరాల మెట్ట భూమిని ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో భూ రీసర్వే చేసి, నా పొలాన్ని దేవాలయ భూమిగా ఆన్‌లైన్‌లో మార్చేశారు. దీంతో బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు అందట్లేదు. మా భూమిని తిరిగి ఆన్‌లైన్‌లో చేర్చాలి.

- ఉలిగమ్మ, రైతు, కరకముక్కల

అలసిపోయా..



సర్వే నంబరు 46లో నాకు ఎకరం మాగాణి పొలం ఇచ్చారు. భూ రీసర్వే పేరుతో మా పొలాన్ని దేవాలయ భూమిగా మార్చి మా పొట్ట కొట్టారు. 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. ఏనాడూ ఇలాంటి సమస్య రాలేదు. ప్రస్తుతం అండగల్, వన్‌బీ రాక ఇబ్బందులు పడుతున్నాం.

- ఎల్లమ్మ, రైతు, కరకముక్కల

ఆన్‌లైన్‌లో వచ్చేలా చూడండి..



సర్వే నంబరు 43లో నాకు ఎకరం మాగాణి పొలం ఇచ్చారు. 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. గత ప్రభుత్వంలో రీ సర్వే మా పొలాన్ని ప్రభుత్వ భూమిగా మార్చేశారు. దీంతో ప్రభుత్వ పథకాలు అందట్లేదు. ఏటా వన్‌బీల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళితే మాన్యువల్‌గా ఇస్తున్నారు. వాటిని బ్యాంకు అధికారులు తీసుకోవట్లేదు. ఇది చాలా అన్యాయం.

- తిప్పమ్మ, రైతు, కరకముక్కల





దళిత మహిళలకు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకం

న్యాయం చేస్తాం..

రీ సర్వేలో జరిగిన పొరపాటును పరిశీలించి, దళిత రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం. రికార్డులను పరిశీలించి, జిల్లా అధికారులతో చర్చించి, ఆన్‌లైన్‌లో వన్‌బీలు అడంగల్ వచ్చేలా చర్యలు చేపడతాం.

- చంద్రశేఖరయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్, విడపనకల్లు

క్రైం కార్నర్

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

● ఫెయిల్ కావడమే కారణం


జావేద్ (ఫైల్)

గుంతకల్లు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ఫెయిలయ్యానన్న విరక్తితో మహమ్మద్ జావేద్ (18) పట్టణంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. కూడేరులో ఐషర్ డ్రైవరుగా పనిచేస్తున్న జాఫర్ వలి కుమారుడు జావేద్ గుంతకల్లులో తన అమ్మమ్మ ఇంట్లో ఉండి గుత్తి గేట్స్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల పరీక్షా ఫలితాలు రావడంతో అందులో జావేద్ ఫెయిల్ అయ్యాడని అతడి బంధువులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బైక్‌లో వెళ్లిన జావేద్ రాత్రి ఇంటికి తిరిగి రాలేదన్నారు. రాత్రే అతడి స్నేహితులందరినీ విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో గుంతకల్లు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా తిమ్మనచెర్ల రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు, బంధువులు అక్కడకు వెళ్లగా, అక్కడ ట్రాక్ పక్కన ఓ మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు పరిశీలిస్తూ కనిపించారు. ఆ మృతదేహాన్ని జావేద్‌గా అతడి బంధువులు గుర్తించారు. జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర మృతుడు జావేద్ బంధువుల నుంచి ఫిర్యాదును స్వీకరించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసును నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

బైకు దొంగల అరెస్టు


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్

బత్తలపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి 11 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ గురువారం తెలిపారు. బత్తలపల్లిలోని వై జంక్షలో గురువారం ఎస్ఐ సోమశేఖర్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు బైకులలో ఆరుగురు యువకులు వచ్చారు. వారి వద్ద వాహనాలకు సంబంధించిన రికార్డులు లేకపోవడంతో పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ విచారించగా వారు అనంతపురం నగరానికి చెందిన ప్రణయ్, ధనుష్, సిద్ధి వినయ్‌తో పాటు మరో ముగ్గురు మైనర్లుగా తేలింది. వీరు బత్తల పల్లి, ధర్మవరం, అనంతపురంలలో 11 బైకులు దొంగిలించి అమ్మినట్లు తెలిపారు. వచ్చిన డబ్బుతో జల్సాలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అమ్మిన బైకులను రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కానిస్టేబుళ్లు ఆంజనేయులు, అనిల్, లింగమయ్య, గోపాల్‌లను సీఐ అభినందించి రివార్డు అందజేశారు.

ఇద్దరు రైతుల బలవన్మరణం


పోతులింగ(ఫైల్)


రామాంజనేయులు(ఫైల్)

గుమ్మఘట్ట/ధర్మవరం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గుమ్మఘట్ట మండల కేంద్రానికి చెందిన రైతు పోతులింగ(45) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ శివారులో చెట్టుకు బుధవారం అర్ధరాత్రి ఉరేసుకున్నాడు. పోతులింగకు రెండెకరాల పొలం ఉంది. మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న, వేరుశనగ పంటలను సాగు చేసి నష్టపోయాడు. అప్పులు రూ.9 లక్షల దాకా పేరుకుపోయాయి. దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య గంగమ్మ, కుమారులు అనిల్, తిప్పేస్వామి ఉన్నారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ధర్మవరం మండలం పోతుకుంటకు చెందిన కౌలు రైతు కొడిమి రామాంజినేయులు(42) విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. రామాంజినేయలు మరూరు వద్ద 5 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని రెండేళ్ల నుంచి వేరుశనగ, కంది సాగు చేస్తున్నాడు. పంటలు సరిగా పండక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.10 లక్షల వరకూ పేరుకుపోయాయి. దిక్కుతోచని స్థితిలో ఇంట్లో ఎవరూలేని సమయంలో గురువారం విషపు గుళికలు మింగాడు. కుటుంబ సభ్యులు గమనించి, అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఆయనకు భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య


బాలకృష్ణ మృతదేహం

ధర్మవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు బాలకృష్ణ(43) గురువారం రాత్రి ఉరివేసుకున్నాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. బాలకృష్ణ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. బాలకృష్ణకు భార్య ప్రమీల, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


ఎర్రిస్వామి (ఫైల్)

రాయదుర్గం టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాశీపురం గ్రామానికి చెందిన రైతు కావలి ఎర్రిస్వామి(54) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తన తోటలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజులు వేసే సమయంలో గురువారం ప్రమాదానికి గురయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అటువైపు వెళ్లిన గొర్రెల కాపరులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ జయనాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎర్రిస్వామికి ఇద్దరు భార్యలు, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే

నేడు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు ప్రాణాలను త్యజించిన రోజు గుడ్‌ఫ్రైడే. చెడుమీద మంచి సాధించిన విజయానికి ప్రతీకగా శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. యేసయ్యకు మరణం లేదని నిరూపించడానికే ఆయన మూడో రోజునే పునరుత్థానం చేశారని బైబిల్ సారాంశం. ఈ పునరుత్థానదినాన్నే క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకుంటారు. ఇంతటి పవిత్రమైన రోజు అయిన గుడ్‌ఫ్రైడేను క్రీస్తు మందిరాలన్నింటిలోనూ సంతాపదినంగా పాటిస్తూ ప్రార్థనలు నిర్వహిస్తారు. యేసు త్యాగనిరతిని స్మరించుకుంటూ ఉపవాసదీక్షను ఆచరిస్తుంటారు క్రైస్తవులు. దీంతో జిల్లాలోని క్రైస్తవ మందిరాలన్నీ గుడ్‌ఫ్రైడేకి సిద్ధమయ్యాయి. రామచంద్రనగర్‌లోని కార్మెల్ మాత, సప్తగిరి సర్కిల్‌లోని ఎస్ఐయూ, అరవిందనగర్‌లోని సీయస్ఐ టౌన్ కాంగ్రిగేషనల్ తదితర చర్చిలన్నీ ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్తాబయ్యాయి.



ఉదయం 10 నుంచి ప్రార్థనలు

గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని చర్చిల్లో ప్రార్థనలు చేస్తారు. గుడ్ ఫ్రైడే రోజున యేసు క్రీస్తు త్యాగాన్ని స్మరించుకుని ప్రార్థనలు నిర్వహిస్తారు. మూడోరోజు ఆదివారం యేసు పునరుత్థానానికి సంకేతంగా చర్చిలను సుందరంగా ముస్తాబు చేసి, ప్రత్యేక ప్రార్థనలు ఆచరిస్తారు.

- స్వామిదాస్, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

బడిపిల్లలు అంటే అంత చులకనా..?


● పాఠశాల వద్ద బస్సులు ఆపకుండా వెళ్లడంపై ఆగ్రహం ● ధర్నాకు దిగిన తల్లిదండ్రులు


బస్సులను అడ్డగించిన విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు

యాడికి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు వదిలిన సమయంలో విద్యార్థులను ఎక్కించుకోకుండా వెళ్తున్న బస్సు డ్రైవర్ల తీరుపై గురువారం మండల కేంద్రంలో వారి తల్లిదండ్రులు, స్థానికులు ధర్నాకు దిగారు. మధ్యాహ్నం పాఠశాలలు వదిలిన సమయంలో యాడికి నుంచి తాడిపత్రి, నిట్టూరు వైపు వెళ్లే విద్యార్థులు బస్సుల కోసం రోడ్డుపై ఎదురుచూస్తున్నారు. ఆ సమయంలో వచ్చిన రెండు ఆర్టీసీ బస్సులు విద్యార్థులను ఎక్కించుకోకుండా వేగంగా వెళ్లిపోయాయి. దీనిని గమనించిన కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు.. ద్విచక్రవాహనాల్లో వెంబడించారు. స్థానిక కోనరోడ్డు సర్కిల్‌లో రోడ్డుకు అడ్డంగా ద్విచక్రవాహనాలు పెట్టి ధర్నాకు దిగారు. బస్సుల డ్రైవర్లు, కండక్టర్లను కిందకు దింపి నిలదీశారు. బడిపిల్లలు అంటే అంత చులకనా.., అటువంటపుడు బస్సు పాసులు ఎందుకు ఇచ్చినట్లు అని మండిపడ్డారు. బడులు వదిలే సమయంలో రోజూ ఇలానే చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. బస్సుల కోసం విపరీతమైన ఎండలో రోడ్డుపై నిలబడి విద్యార్థులు ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు. తాడిపత్రి బస్సు డిపో మేనేజర్ వచ్చేదాకా బస్సులు కదలనిచ్చేదిలేదని రోడ్డుపై అడ్డంగా ధర్నాకు దిగారు. బస్సుడ్రైవర్ల తీరును నిరసిస్తూ స్థానికులు పెద్దఎత్తున గుమికూడారు. దీంతో ట్రాఫిక్ పెద్దఎత్తున స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, విద్యార్థుల తల్లిదండ్రులకు, స్థానికులకు సర్దిచెప్పారు. విద్యార్థులను ఎక్కించుకోకుండా వెళ్లిపోతున్న బస్సు డ్రైవర్లు, కండక్టర్లు మందలించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆర్టీసీ సిబ్బందికి పోలీసులు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు శాంతించడంతో సమస్య సద్దుమణిగింది. బడులు వదిలే సమయంలో బడిపిల్లలను కచ్చితంగా బస్సుల్లో ఎక్కించుకునేలా డిపో మేనేజర్ ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

నెరవేరిన అనంత ప్రజల ఏళ్ల కల


● పుట్టపర్తి-బెంగళూరు రైలు... అనంతపురం వరకూ పొడిగింపు
● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


పార్లమెంటు సమావేశాల్లో రైలు పొడిగింపు అంశంపై మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ (ఫైల్)

అనంతపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి, బెంగళూరు మధ్య నడుస్తున్న మెము రైలును అనంతపురం వరకూ పొడిగిస్తూ రైల్వే బోర్డు ఈనెల 15వ తేదీన ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. గత పార్లమెంటు సమావేశాల్లో రైలు పొడిగింపు అంశంపై అనేక సార్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్), దక్షిణ పశ్చిమ రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్) జనరల్ మేనేజర్లను కలిసి పుట్టపర్తి-బెంగళూరు రైలును అనంతపురం వరకూ పొడిగించాలని కోరానన్నారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నను వ్యక్తిగతంగా కలిసి విన్నవించానన్నారు. వారి సహకారంతో రెండు రైల్వే జోన్లను ఒప్పించి, అనంతపురం వరకూ పొడిగించారన్నారు. దీంతో అనంతపురం ప్రజల ఏళ్ల కల నెరవేరిందన్నారు. దీంతో బెంగళూరు వెళ్లే ప్రయాణికులు ఈరైలు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇది సామాన్య ప్రయాణికులతోపాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలకు ఎంతో ఉపశమనం కలిగించే అంశమన్నారు. ఇప్పటి వరకూ ఉన్న స్టాపేజ్‌తో పాటు విధురాశ్వత్థం, కొత్తచెరువు, బాసంపల్లి, చిగిచెర్ల, జంగాలపల్లె, ప్రసన్నాయపల్లి స్టేషన్లలో కూడా ఈ రైలు ఆపుతారన్నారు. ఈ రైలు అనంతపురం స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరి సాయంత్రం 7 గంటలకు బెంగళూరు స్టేషన్‌కు చేరుకుంటుందని ఆయన వివరించారు.

నీరు.. విద్య.. వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వండి

● అధికారులకు ప్రజాప్రతినిధుల సూచన


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, విప్ కాలవ, ఎంపీ బీకే, ఎమ్మెల్యేలు అమిలినేని, దగ్గుపాటి, అశ్మిత్ రెడ్డి

అనంతపురం టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీరు, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికార పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు జిల్లా యంత్రాంగానికి సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా మినరల్ ఫండ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్ర బాబు, అశ్మిత్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా మినరల్ ఫండ్ కింద 30 శాతం రాయల్టీగా రూ135.34 కోట్లు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 1473 పనులకు రూ61.62 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. వచ్చిన నిధులలో ఇప్పటి వరకూ రూ39.11 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. మరో 403 పనులకు రూ.23.57 కోట్లు కేటాయించామని, ఇంకా రూ52.66 కోట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నిధులలో ఒక్కో జిల్లాకు రూ.3 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ కాలవ కలెక్టరుకు సూచించారు. పనులకు ప్రతిపాదనలను ప్రజాప్రతినిధుల నుంచి తీసుకోవాలని ఎంపీ బీకే సూచించారు. తమ నియోజకవర్గాలలో అభివృద్ధి, ఇతర పనులకు నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యేలు కోరారు.

ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో 2025-26 విద్యా ఏడాదికి 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు డీఈఓ ప్రసాద్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ సిలబస్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ అనుసరిస్తున్న అన్ని ప్రైవేట్ స్కూళ్లలో విద్యాహక్కు చట్టం-2009 సెక్షన్ 12(1) మేరకు 1వ తరగతిలో 25 శాతం ఉచితంగా సీట్లు ఇవ్వాలన్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల వారి పిల్లలకు వారు నివాసం ఉండే సమీపంలోని అన్ని స్కూళ్లలో ఈ ఉచిత సీట్లు కేటాయించాలన్నారు. 1వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకూ దరఖాస్తు చేయాలన్నారు. విద్యార్థుల ఆధార్ కార్డు, ఇతర ప్రాథమిక వివరాలను http://cse.ap.gov.in వెబ్‌సైట్ లో అప్లై చేయాలన్నారు. సంబంధిత గ్రామ సచివాలయం లేదా ఎంఈఓ ఆఫీస్ లేదా సంబంధిత స్కూళ్లలో పిల్లల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను సంబంధిత పాఠశాలల్లో ఉంచుతామన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 18004258599 సంప్రదించాలని సూచించారు.

నాన్నను వచ్చాను.. లేవరా..!

● అమ్మ వచ్చే వరకైనా ఉండరా..!
● కొడుకు మృతదేహంపై పడి రోదించిన తండ్రి
● ఇద్దరు యువకులను మింగిన బైక్ ప్రమాదాలు


సుమంత్(ఫైల్)

పామిడి/అగళి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు బైక్ ప్రమాదాలలో ఇద్దరు యువకులు మృతిచెందారు. దీంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. పామిడి సమీపంలో బైక్ అదుపుతప్పి సుమంత్ (25) అనే యువకుడు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తండ్రి శివప్రసాద్.. పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి కొడుకు మృతదేహాన్ని చూసి కుప్పకూలిపోయారు. 'రేయ్ నాన్నను వచ్చాను లేవరా..! మీ అమ్మ వచ్చేవరకైనా ఉండురా..! మీ అమ్మకు నేను ఏమని సమాధానం చెప్పాలిరా..?' అంటూ ఒక్కగానొక్క కొడుకు సుమంత్ మృతదేహంపై పడి కన్నీరు మున్నీరయ్యారు. అనంతపురం నగరంలోని అశోక్ నగర్‌కు చెందిన శివప్రసాద్ కుమారుడు సుమంత్ టీ కేఫ్ నిర్వహించేవాడు. గుంతకల్లు నుంచి అనంతపురానికి వెళుతుండగా పామిడి శివారులోని అయ్యప్పస్వామి గుడి వద్ద బైక్ అదుపుతప్పింది. 44వ జాతీయ రహదారిపై కల్వర్టుకు ఢీకొట్టడంతో సుమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తండ్రి.. ఆస్పత్రికి వచ్చి గుండె పగిలేలా ఏడ్చారు. మరో ప్రమాదంలో.. అగళి మండలం మధుడి గ్రామానికి చెందిన మంజునాథ్(25) మృతిచెందాడు. కర్ణాటకలోని హసన్‌లో మంజునాథ్ బేకరిలో పని చేసేవాడు. స్వగ్రామానికి గురువారం వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ఈ ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


కుమారుని మృతదేహంపై పడి విలపిస్తున్న తండ్రి శివప్రసాద్

పెట్రోల్ బాటిల్‌తో కలెక్టరేట్‌లో మహిళ హల్‌చల్


స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న పోలేరమ్మ

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): తన సొంత స్థలాన్ని బంధువులు కబ్జా చేసి, అక్రమంగా నిర్మాణాలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ రామగిరి మండలంలోని దొంతిమర్రి గ్రామానికి చెందిన పోలేరమ్మ గురువారం కలెక్టరేట్‌కు పెట్రోల్ బాటిల్‌తో వచ్చి హల్‌చల్ చేశారు. ఆత్మహత్య చేసుకుంటున్నాని గట్టిగా కేకలు వేయడంతో, గమనించిన పోలీసులు ఆమె వద్ద నుంచి పెట్రోల్ బాటిల్‌ను లాకున్నారు. సమస్యను అధికారులకు చెప్పాలని పంపారు. పోలేరమ్మ మాట్లాడుతూ.. సొంత స్థలంలో బంధువులు అక్రమంగా ప్రహరీ నిర్మించారని, దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక పెట్రోల్ బాటిల్‌తో కలెక్టరేట్ వద్దకు వచ్చినట్లు పేర్కొన్నారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు.

హంద్రీనీవా కాలువకు మళ్లీ గండి


నక్కలగుట్ట కాలనీ సమీపంలో కాలువకు పడిన గండి

సోమందేపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు మళ్లీ గండి పడింది. మండల కేంద్రం సమీపంలోని నక్కలగుట్ట కాలనీ వద్ద గురువారం ఉదయం మడకశిర ఉప కాలువకు గండిపడింది. దీంతో చాకర్లపల్లి కుంటకు, అక్కడి నుంచి చల్లాపల్లి చెరువు నిండి నాగలూరు చెరువుకు నీరు చేరింది. గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద నీటి పంపింగ్‌ను ఆపేశారు. కాలువలో నీటి ప్రవాహం తగ్గిపోయాక గండి పూడ్చే పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 1న 47వ కి.మీ, వద్ద కాలువకు గండిపడి నీరు పొలాలను ముంచెత్తింది. అధికారులు ఆగమేఘాలపై అప్పట్లో గండిని పూడ్చేశారు. ఈ నేపథ్యంలో మళ్లీ గండిపడడం అనుమానాలకు తావిస్తోంది. కాలువగట్లు తెగుతున్నాయా, తెగ్గొడుతున్నారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ పాలనలో కాలువ మరమ్మతులు, నిర్వహణను గాలికొదిలేయడంతో పూడిపోయి, చెట్లు పెరిగిపోయి గండ్లు పడుతున్నాయన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

రుణాల కోసం దళారీలను ఆశ్రయించవద్దు: ఈడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విడుదల చేసిన సబ్సిడీ రుణాల విషయంలో మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సబ్సిడీ రుణాలు ఇప్పిస్తామని కొందరు మధ్యవర్తులు అమాయక ఎస్సీ ప్రజలను మోసం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిని నమ్మి ఎవరూ డబ్బులివ్వ వద్దన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నిష్పక్షపాతంగా స్క్రూట్నీ జరిపి రుణాలు అందజేస్తామన్నారు. మే 10 వరకూ అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంత జిల్లాకు 823 యూనిట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 604 యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు.

రాయి మీదపడి వ్యక్తి మృతి


వేణుగోపాల్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇంటి పైకప్పుపై నుంచి రాయి పడి వేణుగోపాల్(34) అనే వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో ఈ ప్రమాదం బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వర్షం కురుస్తుండటంతో నీరు కారకుండా ఇంటిపైకప్పుపై టార్పాలిన్ కప్పి, బరువుకోసం దానిపై రాళ్లు పెట్టారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి భారీ ఈదురుగాలులు వీయడంతో వరండాలో పడుకున్న వేణుగోపాల్‌పై ఓ రాయి పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య సునంద, కుమారుడు అరుణ్, కూతురు మహాలక్ష్మి ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెటర్లూ... పేర్లు నమోదు చేసుకోండి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 2025-26 క్రికెట్ సీజన్ కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రికెటర్లు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. అండర్-12, 14, 16, 19, 23, సీనియర్ బాల, బాలికల కేటగిరీలలో ఉన్న క్రీడాకారులు ఈనెల 20 నుంచి మే 20లోపు అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ (ఆర్డీటీ స్టేడియం)లోని జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. ఒరిజినల్ ఫారం-5 (జనన ధ్రువీకరణ పత్రం), ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, తాజా పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, తల్లిదండ్రులు ఆధార్ కార్డులతో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయండి



నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారి

నల్లమాడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక 30 పడకల ఆసుపత్రికి వెళ్లే దారిలో వీధి దీపాలు లేక రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయమని స్థానికులు వాపోతున్నారు. పుట్టపర్తి ప్రధాన రహదారి నుంచి ఉండే రహదారికి ఇరువైపు గడ్డి ఏపుగా పెరిగింది. దీంతో అక్కడ విషపురుగులు, పాములు ఎక్కువగా సంచరిస్తున్నాయి. రాత్రి సమయంలో రోగులు ఆ ఆసుపత్రికి నడిచి వెళ్లాలంటే రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ రహదారిలో వీధి దీపాలు ఏర్పాటుచేస్తే విషపురుగుల ప్రమాదం నుంచి బయటపడే అవకాశముంది. అధికారులు, నాయకులు స్పందించి ఈ రహదారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయానికి రోడ్డు వేయండి

నల్లమాడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ యనుములవారిపల్లి సమీపంలో ఉన్న దేవరగుళ్లలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సరైన దారిలేదు. పాత బత్తలపల్లి మీదుగా కదిరికి వేళ్లే ప్రధాన రహదారి నుంచి దేవరగుళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపం వరకు తార్ రోడ్డు వేశారు. అక్కడి నుంచి గుడి దాదాపు అర కిలోమీటర్ దూరంలో ఉంది. ఆ దారి ఎగుడు దిగుడు రాళ్లతో నిండి ఉంది. పిల్లలు, మహిళలు, వృద్ధులు ఈ దారిన గుడికి వెళ్లడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఈ ఆలయానికి సమీపంలోని ఎనిమిది గ్రామాల వాసులు స్వామి వారి దర్శనానికి వస్తుంటారు. అంతేకాకుండా ఇక్కడ శుభకార్యాలు జరుపుకుంటారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి గుడి వరకు రోడ్డు వేయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, భక్తులు కోరుతున్నారు.



లక్ష్మీనరసింహస్వామి ఆలయ దారి



సర్వే రాళ్లపై పేర్లను తొలగిస్తున్న సిబ్బంది

సర్వే రాళ్లపై జగన్ పేరు తొలగింపు

తనకల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల వద్ద గత వైసీపీ పాలనలో రీసర్వే నిర్వహించడానికి సర్వే రాళ్లను తెప్పించారు. అయితే ఆ రాళ్లపై జగనన్న భూరక్ష అని ముద్రించారు. నూతన ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రీసర్వేలను రద్దు చేసింది. సర్వేలను పారదర్శకంగా నిర్వహించడానికి మార్గదర్శకాలు జారీచేసి రీసర్వే చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆ సర్వేరాళ్లపై ఉన్న జగనన్న భూరక్ష పేర్లను తొలగించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. మండలంలోని ఉస్తిలిపల్లి, పెద్దవద్దులవారిపల్లి, గ్రామాల వద్ద ఉన్న సర్వే రాళ్లపై ఉన్న జగన్ పేరును తొలగించే పనులు ప్రారంభించారు.

న్యూస్ బాక్స్

వాహనాలను తనిఖీ చేసిన ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్ళకుంట కూడలిలో గురువారం రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు పలు వాహనాలను ఎస్పీ వీ.రత్న తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ప్రతిఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ విజయ్‌కుమార్, పట్టణ, రూరల్ సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్ అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు, ముకుంద, లక్ష్మీఓబుళేశు, ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొగ్గు నాగరాజు, జయ పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

కొత్తచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమర్ల గ్రామానికి చెందిన సుదర్శన్‌కు కొత్తచెరువు వాసి వరలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు రూ. 10 వేల విలువైన ట్రై సైకిల్‌ను అందజేశారు. సుదర్శన్‌కు చిన్నప్పుడే పోలియో సోకి రెండు కాళ్ళు చచ్చుబడిపోయాయి. తనను ఆదుకోవాలని ఆయన పుట్టపర్తిలోని ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను కోరారు. దీంతో వరలక్ష్మి కుటుంబ సభ్యులు అందజేసిన ట్రై సైకిల్‌ను తలమర్ల గ్రామంలోని అతనికి గురువారం అందజేసినట్లు ఆ ట్రస్ట్ సభ్యులు షామీర్, రామంజి, గోపి తెలిపారు.

నేడు జౌకలలో సీపీఎం సభ

నంబులపూలకుంట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జౌకల గ్రామ పరిసరాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు భూములు సేకరిస్తున్నారని, ఈ నేపథ్యంలో జౌకలలో సీపీఎం శుక్రవారం నిర్వహిస్తున్న సభకు రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆ పార్టీ, రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వారు జౌకల, మరికొమ్మెదిన్నె, నల్లగుంట్లపల్లి, గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. ఈ సభలో రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొంటారని నాయకులు నాగిరెడ్డి, గంగిరెడ్డి నాగరాజు తెలిపారు.

డీఈఓ కార్యాలయ ఏడీగా శ్రీనివాస్‌రావు

కొత్తచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీగా శ్రీనివాస్‌రావు బాధ్యతలు చేపట్టారని డీఈఓ గురువారం తెలిపారు. గత ఏడీ నాగరాజు ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ప్రభుత్వం రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రావును జిల్లాకు బదిలీ చేశారు.



అభ్యంతరకర పోస్టులు పెడితే చర్యలే..

నల్లమాడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సోషియల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెడితే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ నరేంద్రరెడ్డి గురువారం హెచ్చరించారు. మండలంలో పేకాట స్థావరాలపై నిఘా ఉంచామని, పేకాట ఆడడానికి వెళ్తున్న వారి సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులు ఇస్తే వారికి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు.

నేడు మంత్రి రాక

ధర్మవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం ధర్మవరం వస్తున్నారు. మధ్యాహ్నం 12-25 గంటలకు మార్కెట్ యార్డ్ సమీపంలోని పోలా ఫంక్షన్‌హాల్‌లో జరిగే బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలి జయశ్రీ సన్మాన సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2-30 గంటలకు ఎన్డీఏ కార్యాలయం అందుబాటులో ఉంటారు. 3-30 గంటలకు శ్రీలలిత నాట్యకళానికేతన్ కళాకారులను మంత్రి సన్మానిస్తారు.

సమస్యలపై సీహెచ్ఓల ధర్నా



పీహెచ్‌సీ ముందు ధర్నా నిర్వహిస్తున్న సీహెచ్ఓలు

తనకల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని సీహెచ్ఓలు (కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లు) గురువారం మండలంలోని కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్ఎన్ఎం ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను సకాలంలో అందించాలని అన్నారు. వినతిపత్రాన్ని డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డికి అందించారు.

రైతులకు పరిహారం అందజేత

తాడిమర్రి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమీపంలో జరుగుతున్న అధాని పవర్ ప్రాజెక్టు పనుల వల్ల పంట నష్టపోయిన 17 మంది రైతులకు రూ.11 లక్షలు నష్టపరిహారం మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను బాధిత రైతులకు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి గురువారం అందజేశారు.

మహాసభలను జయప్రదం చేయండి

ధర్మవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో వచ్చే నెల 9 నుంచి 11 వరకు నిర్వహించే ప్రగతి శీల విద్యార్థి సంఘం (పీఎస్‌యూ) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో గురువారం అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.



కదిరి డిపో ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజనల్ చైర్మన్ ముత్యాలప్ప డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ జోనల్ నాయకులు ఏఎస్‌రావు, రీజనల్ నాయకులు జీవై నాగప్ప, దుర్గాప్రసాద్, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, హరి, డిపో నాయకులు హనుమాన్, మధు, ప్రభాకర్, వైవీఎన్ రెడ్డి, పీఎస్ ఖాన్, గోపాల్, మంజునాథ్ పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తేనే సంస్థ అభివృద్ధి చెందుతుందని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీ రమణ పేర్కొన్నారు. గురువారం డిపో ఎదుట సర్క్యులర్ 1/19 యధావిధంగా అమలు చేయాలని ఆందోళన చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వహీదాబేగం, రామచంద్ర, శ్రీనివాసులు, శ్రీరామనాయక్, తిమ్మన్న, భాస్కర్ పాల్గొన్నారు.

అనధికారికంగా టెంకాయల విక్రయం



ఆలయం ముందు ఉంచిన తోపుడు బండి

కదిరి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ముందు ఎటువంటి అనుమతులు లేకుండా టెంకాయలు విక్రయిస్తున్నారు. టెంకాయల టెండర్ ముగియడంతో ఆలయ ఆవరణంలో టెంకాలు అమ్మడానికి వీలు లేదు. అయినా అనధికారికంగా తోడుపు బండి పెట్టుకుని టెంకాయలు విక్రయిస్తున్నారు. దీనిపై ఈఓ శ్రీనివాసురెడ్డి చెప్పినా.. ఆ పెడచెవిని పెట్టినట్లు అధికారులు చెప్పారు. అంతేకాకుండా తోపుడుబండి ఆలయ మార్గానికి అడ్డంగా పెట్టడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

త్వరలో టీడీపీ జిల్లా కార్యాలయ భవనం ప్రారంభం



భవనాన్ని పరిశీలిస్తున్న అంజినప్ప, పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): త్వరలో జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప పేర్కొన్నారు. గురువారం ఆయన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలసి మామిళ్ళకుంట కూడలిలో నిర్మిస్తున్న తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని పరిశీలించారు. అతిత్వరలోనే హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ చేతుల మీదుగా ఈ భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు.

ముస్లింల దీక్షకు మద్దతు

ధర్మవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర వెంటనే రద్దు చేయాలని ముస్లింలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరాహార దీక్షకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ... వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రం ప్రభుత్వం తీసుకురావడం దురుద్దేశంతో కూడుకుందన్నారు. ముస్లిం మైనార్టీలకు చెందిన వక్ఫ్ కమిటీలలో అన్ని మతస్తులకు ప్రవేశం కల్పించే విధంగా జీఓలు తీసుకురావడం ఎంతవరకు సమంజసమన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధి హామీ క్షేత్రసహాయకులు గురువారం ఎంపీడీఓ రాబర్టు విల్సన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్షేత్రసహాయకులు సంఘం మండల అధ్యక్షుడు కొండకమర్ల రామాంజి, ప్రధాన కార్యదర్శి ఉత్తప్ప మాట్లాడుతూ... తమ వేతనాలు పెంచడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో క్షేత్రసహాయకులు పీట్ల మనోహర్, షబ్బరీస్ నాయుడు, వెంకటరామిరెడ్డి, గంగాద్రి, రమణ, సురేష్ పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి క్షేత్ర సహాయకులు

కేజీబీవీల్లో ఫలితాలు భేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవరాజ్

కొత్తచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 30 కేజీబీవీ కళాశాలలు ఉండగా.. అందులో 12 కళాశాలలో ఈ విద్యా సంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధించడం చాలా గర్వంగా ఉందని సమగ్ర శిక్ష పథక అదనపు సమన్వయ కర్త దేవరాజ్ అన్నారు. గురువారం బుక్కపట్నంలో సమగ్ర శిక్ష కార్యాలయంలో జిల్లాలోని కేజీబీవీ ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు విజ్ఞాన యాత్ర



శ్రీహరికోట వద్ద గాండ్లపెంట విద్యార్థినులు

గాండ్లపెంట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగాల్లో తమదైన ప్రతిభ కనబరచిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థినులకు సత్యసాయి జిల్లా విద్యాశాఖ విజ్ఞాన యాత్ర ఏర్పాటు చేసింది. ఈ యాత్రలో భాగంగా ఆ విద్యార్థులు గురువారం శ్రీహరికోట (అంతరిక్ష పరిశోధన కేంద్రం)ను సందర్శించారు. విద్యార్థులు ఆరీషా, సాధబ్, లిఖిత, యశ్వనీ, శమఫిర్‌దోష్, మోక్షిత, నీహతబ్‌సుమ్, గీతిక, పూజిత ఆ పరిశోధన కేంద్రంలో పలు రాకెట్, శాటిలైట్ల నమూనాలను పరిశీలించారు. వీరి వెంట ఉపాధ్యాయులు ఓబులరెడ్డి, రాజారత్నం ఉన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం కూలీలకు బకాయి వేతనాలను చెల్లించాలని సీపీఐ ఆధ్వర్యంలో కూలీలు గురువారం ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సీపీఐ డివిజన్ కార్యదర్శి అంజి, మండల కార్యదర్శి చలపతినాయుడు మాట్లాడుతూ.. మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు రాలేదన్నారు. ఎండలు మండుతున్న ఈ రోజుల్లో పని ప్రదేశాల్లో కనీసం సౌకర్యాలు అధికారులు కల్పించడం లేదని, కనీసం మెడికల్ కిట్ కూడా అందుబాటులో ఉండటం లేదని వాపోయారు. ఇప్పటికైనా కూలీలకు బకాయిలు మంజూరు చేయాలనీ, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ రాబర్టు విల్సన్‌కు వినతిపత్రం అందించారు.

డిప్యూటీ డీఈఓ విచారణ

కదిరి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల కదిరిలో నిర్వహించిన పది పరీక్షల్లో సస్పెండ్ అయిన ఉపాధ్యాయులపై పెనుకొండ డిప్యూటీ డీఈఓ పద్మప్రియ గురువారం విచారణ చేపట్టారు. అలాగే రాణిపేట పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్‌పై ఓ టీచర్ రెండు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. దీనిపై కూడా ఆమె విచారించారు. అనంతరం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎంఈఓ చెన్నక్రిష్ణ, ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఈ-వేస్టు కేంద్రాలు ఏర్పాటు చేయండి : కలెక్టర్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, 32 మండలాల్లో ఈ వేస్టు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం స్వచ్ఛంధ్రా కార్యక్రమంపై జిల్లాలోని ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మూడో శనివారం నిర్వహించాల్సిన స్వచ్ఛంధ్రా కార్యక్రమంపై సమీక్షించారు. జిల్లాలో ఈ-వేస్టు సేకరించడానికి ప్రతి మండలంలో ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి మున్సిపాలిటీలోనూ అవసరం దృష్ట్యా ఈ-వేస్టు కేంద్రాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, వార్డు సచివాలయ అధికారి సుధాకర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాల జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, పశుసంవర్ధక శాఖ జేడీ సుబదాస్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్

ధర్మవరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూరు వద్ద ఉన్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ స్కూల్ నుంచి ప్రైమరీ స్కూల్‌కు మారే రోజు ఈ గ్రాడ్యుయేషన్ జరుపుకుంటారని ఆ పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. ప్రీ ప్రైమరీలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రూపారాజకృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

క్రైం న్యూస్..

వేర్వేరు ప్రమాదాల్లో.. ఒకే రోజు..

అన్నదమ్ముల మృతి



మునికృష్ణ (ఫైల్)

ముదిగుబ్బ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు వేర్వేరు ప్రమాదాల్లో ఒకే రోజు మరణించారు. మండలంలోని దొరిగల్లు క్వార్టర్‌లో అన్నదమ్ములు రమణ (47), మునికృష్ణ (45) వేరువేరుగా నివాసముండేవారు. రమణ కూలి పనులకు వెళ్లేవాడు. మునికృష్ణ వ్యవసాయ కూలీ. ఈ నెల 14న అన్నమయ్య జిల్లా ములకలచెరువు వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో మునికృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతను బుధవారం రాత్రి మరణించాడు. కాగా, బుధవారం అరటి లోడు పనికి వెళ్లిన రమణ మధ్యాహ్నం సమీపంలోని మద్దిలేరు కాలువలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడి ఈత రాక కొట్టుకొనిపోయాడు. రమణ ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. గురువారం ఉదయం మద్దిలేరు వాగులో అతని మృతదేహం తేలుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతుడిని రమణగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపారు. కాగా, రమణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మునికృష్ణకు భార్య గతంలోనే మరణించింది. ఒక కుమారుడు ఉన్నాడు. ఒకే ఇంట్లో అన్నదమ్ములు ఒకే రోజున మరణించడంతో ఆ కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయింది.

బంగారు గొలుసు చోరీ

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడన్నపల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజినేయులు భార్య రాజేశ్వరి బుధవారం రాత్రి ఇంటి ఆరు బయట నిద్రిస్తున్న సమయంలో ఆమె మెడలోని రూ.1.20 లక్షల విలువైన బంగారు గొలుసు చోరీ అయింది. గురువారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన ఆమె .. పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ శ్రీనివాసులు ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తులో ఉంది.

జూదరుల అరెస్టు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర పరిధిలోని కోవెలగుట్టపల్లి గంగమ్మ గుడి వెనుక ఉన్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేసి .. ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపారు. వారి నుంచి రూ 60,100 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నల్లచెరువు మండలంలో..

కదిరి : నల్లచెరువు మండలంలోని ఓరువాయిలో జూదమాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మగ్బుల్‌బాషా గురువారం తెలిపారు. వారి నుంచి రూ.21,060 స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వైసీపీ నాయకులపై కేసు

ముదిగుబ్బ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కదిరి కోర్టు ఉత్తర్వుల మేరకు ఇద్దరు వైసీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపారు. మండల కేంద్రంలోని రైల్వే గేట్ కొట్టాలలో చలివేంద్రం ఏర్పాటు విషయంలో పరస్పర ఫిర్యాదుల మేరకు మంగళవారం టీడీపీకి చెందిన నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం కదిరి కోర్టు ఉత్తర్వుల మేరకు గురువారం రైల్వే గేట్ కొట్టాలకు చెందిన వైసీపీ నాయకులు బాబ్జాన్, షరీఫ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పాఠశాలకు దాతల సహకారంతో సోలార్ కంచె



ప్రహరీకి సోలార్ కంచె ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తనకల్లు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నరాయస్వా మి గుడి ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు దాతల సహకారంతో సోలార్ కంచె ఏర్పాటు చేశారు. ఈ పాఠశాల ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండడంతో ఆకతాయిలు రాత్రి సమయంలో పాఠశాల ఆవరణంలోకి వస్తుండటంతో బాలికలు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను బాలిక తల్లిదండ్రులు సాహి తీ గగన్ మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు న్యాయవాది ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అభయ్ ఫౌండేషన్ ఫౌండర్ సుంకుబాలచం ద్ర దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అభయ్ ఫౌండేషన్ ద్వారా రూ.1,77,590 సోలార్ పరికరాలను అందించారు. సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ రూ.30 వేలు కూలీలకు చెల్లించి .. ఆ కంచె ఏర్పాటు చేయించింది. దాతలకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సరస్వతీదేవికి పూజలు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం సరస్వతి పూజ చేపట్టారు. అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు గౌసలాజం, ఉపాధ్యాయులు వెంకటచలమయ్య, గణేష్, పుట్టా సుధాకర్, నరసింహులు, సిబ్బంది, అరుణమ్మ, విమల, లక్ష్మీనరసమ్మ, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

ఘనంగా కనుమ మారెమ్మ జలధి


అలంకరణలో అమ్మవారు

మడకశిర టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన కనుమ మారెమ్మ జాతర మహోత్సవంలో భాగంగా నాల్గవ రోజు గురువారం జలధి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.

కొల్లాపురి మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు


అలంకరణలో అమ్మవారు

రొళ్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి కొల్లాపురి మహాలక్ష్మికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పలు గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఎండుద్రాక్ష, కాజు, బాదం గింజలతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీల సమస్యలు పరిష్కరించాలి


పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు

గుడిబండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట గురువారం ఎంఎల్‌హెచ్‌పీలు నిరసన వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు కలిసి ప్లకార్డులు చేతపట్టుకొని నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమను వెంటనే క్రమబద్ధీకరించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ కింద తక్కువ వేతనంతోనే పనిచేస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

విద్యాసామగ్రి అందజేత


పాఠశాలకు సామగ్రి అందిస్తున్న నాసిన్ అధికారి శ్రీధర్

గోరంట్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలకు రూ.50వేలు విలువ చేసే విద్యా సామగ్రిని నాసిన్ అకాడమి అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్ గురువారం అందజేశారు. హెచ్‌పీ ప్రింటర్ మూడు గ్రీన్ బోర్డులు, 16 నీల్‌కమల్ చైర్లను ప్రధానోపాధ్యాయురాలు మాధవిలతకు ఆయన అందించారు. బెంగళూరుకు చెందిన భవిత చారిటబుల్ ట్రస్టుకు చెందిన ఆనందిత్ ఇన్‌ఫోటెక్ ద్వారా సామగ్రిని సమకూర్చారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలుపుతూ, శ్రీధర్‌ను సత్కరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గోరంట్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌కాలనీలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ తోట శ్రీదేవి గురువారం తనిఖీ చేశారు. కేంద్రాల్లోని రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించి పనితీరుపై ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా దినచర్యలు అమలుచేయాలని కార్యకర్తలను ఆదేశించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ రజిత, కార్యకర్తలు లక్ష్మీ, మనోహరమ్మ ఉన్నారు.

హజ్‌కమిటీ సభ్యుడిగా బాబా ఫక్రుద్దీన్



హిందూపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏపీ హజ్‌కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీలో హిందూపురానికి చెందిన టీడీపీ నాయకుడు బాబాఫక్రుద్దీన్ (డైమండ్ బాబా)ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తనను హజ్‌కమిటీ సభ్యుడిగా నియమించడంపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హజ్‌కు వెళ్లే ముస్లింల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

విలువల కోసం చదవాలి

హిందూపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కార్పొరేట్ విద్యాసంస్థలు విలువలతో కాకుండా మార్కుల కోసం చదువులు చెబుతున్నారని మానసిక వ్యక్తిత్వ నిపుణులు రామక్రిష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమానికి చిలమత్తూరు, లేపాక్షి, కస్తూర్బా విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి

గుడిబండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.కె. పాళ్యం గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ భూమి పూజ కార్యక్రమానికి విచ్చేస్తున్న మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప కోరారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, సవితమ్మ, సత్యకుమార్‌యాదవ్, ఎంపీ బి.కె.పార్థసారథి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆహాజరవుతున్నారన్నారు.

రొళ్ల: మండలంలోని రంగనపల్లి సబ్‌స్టేషన్ భూమి పూజా కార్యక్రమానికి వస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీల పర్యటనను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ దాసిరెడ్డి కోరారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

రేపు క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం

అగళి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మసానిపల్లిలో శని, ఆదివారాల్లో క్రికెట్ లీగ్ సీజన్-1 పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్లు తిప్పేశ్, ఆరాధ్య తెలిపారు. గ్రామంలోని క్రీడా మైదానంలో నిర్వహించే పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొంటాయన్నారు. ఎస్బీఐ మంజునాథ్ మొదటి బహుమతి రూ.50వేలు అందించనుండగా అదే గ్రామానికి చెందిన హరీష్, మహేష్ ద్వితీయ బహుమతి కింద రూ.30వేలు అందించనున్నారు. వివరాలకు 9741249043, 9900772478 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఊటకూరు పీహెచ్‌సీకి భవనం కరువు

- ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రంలో వైద్యసేవలు
- మందుల కోసం ఇతర వైద్యశాలతో సంప్రదింపులు
- వైద్యం అందక రోగుల ఇబ్బందులు
- 2022 నుంచి ఎదురుచూస్తున్న ప్రజలు


ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీని నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటకూరు గ్రామంలో 2022లో 103/5సిలో గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థలం కేటాయించింది. అయితే నిధుల కొరతతో భవన నిర్మాణ పనులు కొనసాగించకుండా గాలికి వదిలేసింది. 26 గ్రామాలు ఊటకూరు పీహెచ్‌సీ పరిధిలో ఉన్నాయి. అప్పటి నుంచి స్థానికులు ఉన్నతాధికారులకు, నాయకులకు వినతులు అందిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేస్తున్నారు తప్ప.. భవన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో వైద్యం నిర్వహిస్తున్నా పూర్తిస్థాయిలో ప్రజలకు అందించలేకపోతున్నారు. ఇతర ఆసుపత్రులకు మందుల కోసం సంప్రదింపులు చేయాల్సి వస్తోంది. కిటికీలు, తలుపులు, నీరు, మరుగుదొడ్లు, మందులు ఉంచడానికి పలు సమస్యలతో వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంతమంది నాయకులు ఆసుపత్రి తనిఖీచేసి ఉన్నతాధికారులకు నివేదించినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. ఈ విషయంపై వినతులు స్వీకరించిన డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం బుధవారం పీహెచ్‌సీని తనిఖీచేయడంతో స్థానికులు ఆమెకు వినతులు అందించారు. స్పందించిన ఆమె త్వరలోనే నిర్మాణ పనులు సాగించేలా ఉన్నతాధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీ సమస్య ఎప్పుడు తీరుతుందో, రోగుల ఇబ్బందులు ఎప్పుడు తీరుతాయో అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యే విధంగా చూడాలని స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పీహెచ్‌సీ నిర్మాణానికి కేటాయించిన స్థలం

నిధులు కేటాయించండి: ఈశ్వరప్ప



ప్రజలకు ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక చుట్టుపక్కల ఆరోగ్యకేంద్రం అందుబాటులో లేక హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. ఊటకూరు గ్రామంలో పీహెచ్‌సీ కోసం మూడేళ్ల క్రితం స్థలం కేటాయించి నిధుల కొరతతో భవన నిర్మాణం చేపట్టకపోవడం విచారకరం. కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు మంజూరుచేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

పూర్తిస్థాయిలో వైద్యం చేయలేకపోతున్నాం: డా.సురేష్



ఆసుపత్రికి భవనం లేకపోవడంతో ఇద్దరు వైద్యులు, ముగ్గురు హెచ్‌ఈఓలు, ఆరుగురు ఏఎన్ఎంలు ఉన్నా పూర్తిస్థాయిలో వైద్యం అందించలేకపోతున్నాం. మందులు అందుబాటులో లేక ఇతర ఆరోగ్యకేంద్రాల నుంచి తీసుకురావాల్సి వస్తోంది. భవన నిర్మాణం పూర్తయితే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు వీలుంటుంది.

పేదరికంలేని దళిత సమాజ స్థాపనే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పక్కన గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశం న్యాయ శాఖ ద్వారా గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయడం హర్షించదగ్గ విషయం అని రిజర్వేషన్ అమలుతో పేదరికంలేని దళిత సమాజ స్థాపనకు ఎంతో తోడ్పడుతుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని 1995-1996 మధ్యలోనే రాష్ట్రపతి ఆర్డినెన్స్ ద్వారా ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంతో దాదాపు 25వేల మందికి ఆనాడే విద్య, ఉద్యోగ పరంగా లబ్ధి చేకూరిందన్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక మేరకు నాలుగు వేల మంది ఉపకులాల సంఘాల అభిప్రాయం, రాష్ట్రంలో దళిత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభిప్రాయాలు సేకరించి నివేదిక ఇవ్వడం, అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించడం, క్యాబినెట్ ఆమోదం పొందడం, గవర్నర్ చేత ఆర్డినెన్స్ జారీ కావడంతో ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చిందన్నారు. రెండు రాష్ట్రాలలో దళితులు సమగ్ర అభివృద్ధి చెందేందుకు ఇదో సువర్ణ అవకాశం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి వల్లే సాధ్యపడిందని, వచ్చే డీఎస్సీ నోటిఫికేషన్‌లో సైతం రిజర్వేషన్ మేరకు నోటిఫికేషన్ జారీ చేస్తుండటంతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ నాగేంద్ర, నాయకులు సురేష్, నాగరాజు, రంగేగౌడ్, తదితరులు ఉన్నారు.

రైతులకు అన్నివిధాలా న్యాయం చేస్తాం

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల

నియోజకవర్గంలోని రైతులకు అన్నివిధాలా న్యాయం చేస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. గురువారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో గత వైసీపీ పాలనలో రైతులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే చొరవతో రైతన్నల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే మంత్రి పర్యటించారని, తప్పితే నియోజకవర్గం గురించి పట్టించుకొన్న నాథుడే లేడన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు మొదట మడకశిర నియోజకవర్గంలోనే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గుండుమల గ్రామంలో ప్రారంభించారన్నారు. శుక్రవారం రైతుల సమస్యల పరిష్కారం కోసం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, సవితమ్మ పర్యటిస్తున్నారని అన్నారు. వీరితోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు, ఎంపీ పార్థసారథి రానున్నారని తెలిపారు.

నిధుల మంజూరుతోనే మున్సిపాలిటీ అభివృద్ధి

- 16వ ఆర్థిక సంఘం చైర్మన్‌కు మున్సిపల్ చైర్మన్ వినతి


ఆర్థిక సంఘం సమావేశంలో పాల్గొన్న చైర్మన్ రమేష్

హిందూపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నిధులు విరివిగా మంజూరు చేస్తేనే మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతాయని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ అన్నారు. గురువారం తిరుపతిలో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశానికి చైర్మన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘం ద్వారా అధికంగా నిధులు కేటాయిస్తే మున్సిపాలిటీ అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో విద్యుత్ బకాయిలు అధికంగా ఉంటున్నాయని, దీనివల్ల సోలార్‌ప్లాంట్ ఏర్పాటుచేస్తే బిల్లులు తగ్గుతాయన్నారు. హిందూపురం మున్సిపాలిటీకి సంబంధించి గొల్లపల్లి రిజర్వాయర్ లాంటి ప్రాంతాల్లో విండ్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తే విద్యుత్ ఆదా అవుతుందన్నారు. పట్టణంలో రోడ్ల విస్తరణ, కాలువల నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఖాళీ ప్రదేశాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడితే మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధించిన కార్యాలయాల పన్నులు సకాలంలో చెల్లించాలని కోరారు. స్టాంప్‌డ్యూటీ ప్రతినెలా జమ చేస్తే అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా ఉంటుందన్నారు.

ఎస్సీ ఆర్డినెన్స్ జారీపై హర్షం


ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రాపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మాదిగలు

గోరంట్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకోసం ఆర్డినెన్స్ జారీ చేయడంపై స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం మాదిగలు సమావేశమై హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి సవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సురేష్ మాదిగ, బూదిలి రామచంద్ర, లక్ష్మీపతి మాదిగ, నరసింహులు, రమేష్‌మాదిగ, గంగాధర్, వెంకటరాముడు, అప్పయ్య, రామాంజనేయులు, సోము పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్: ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ ఆమోదం తెలపడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్, దండోరా నాయకులు అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో దళిత సంఘం నాయకులు, టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణకు ఆమోదం తెలిపినందుకు ప్రభుత్వానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు, పలువురు దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్ సేవా శిబిరం

హిందూపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీడీ రోడ్డు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం వినియోగదారుల సేవా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ డివిజనల్ ఇంజనీర్ రిజ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. వినియోగదారులు తమ సమస్యలు తెలుసుకోవచ్చని తెలిపారు. శిబిరంలో మొబైల్ సిమ్ సేవలు, ఫైబర్‌నెట్, ఇతర సాంకేతిక సేవలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

బీమాతో ధీమా

అమరాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బీమా చేయడం ద్వారా రాబోయే కాలంలో ధీమాగా ఉండవచ్చని పోస్ట్ మాస్టర్ రాజశేఖర్ అన్నారు. తపాలా ఎస్బీ ఐపీఓ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలో తపాలాబీమాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోస్టుమాస్టర్ మాట్లాడుతూ తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ తీసుకొని భవిష్యత్తులో పాలసీ తీసుకొన్న వ్యక్తి అకస్మాత్తుగా మరణిస్తే మొత్తం బీమా వర్తిస్తుందన్నారు. తపాలా సిబ్బంది చంద్రశేఖర్, నాగేంద్రప్రసాద్, నాగేగౌడ్ పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

పెనుకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధిచెందిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో దక్షిణామూర్తిస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రాఘవేంద్రస్వామి స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

ప్రమాదంలో చెరువులు

- అక్రమంగా మట్టి తరలింపు
- పట్టించుకోని అధికారులు

లేపాక్షి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొంతమంది రియల్ వ్యాపారులు, అక్రమ లేఅవుట్ నిర్వాహకులు చెరువులోని మట్టిని అక్రమంగా తరలించేసి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో చెరువులు ప్రమాదకరంగా మారాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్టడి చేయాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తికూడా చూడటం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. లేపాక్షి గ్రామానికి సమీపంలో ఉన్న చిన్నచెరువులో మట్టిని తరలించడానికి అనుకూలంగా ఉండటంతో అక్రమార్కులు ఈ చెరువును ఎంచుకున్నారు. ఎక్స్‌కవేటర్లతో గుంతలను లోతుగా తవ్వేసి మట్టిని తరలించేస్తున్నారు. రైతులు పొలంలోకి మట్టిని తరలించాలంటే పలు నిబంధనలు చూపి అక్రమార్కుల అడ్డదారికి అడ్డు చెప్పలేకపోతున్నారు. కొంతమంది రియల్ వ్యాపారులు డబ్బుతో అధికారుల నోరు మూయిస్తున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. చిన్నచెరువు మరువకు అతిసమీపంలో గోతులు లోతుగా తీయడంతో మరువలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. దీనిని కట్టడి చేయకపోతే చెరువులు ప్రమాదకరంగా మారి ఎక్కడబడితే అక్కడ కట్టలు తెగిపోయే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా సెలవురోజుల్లో ఎక్కువగా మట్టి తరలించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి తరలించేవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


చిన్న చెరువులో తవ్విన గుంతలు


రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం మండలంలోని మోటువారుపల్లిలో రూ.1.60కోట్లతో అభివృద్ధి పనులు మంత్రి ప్రారంభించారు. మంత్రి గ్రామంలోకి రాగానే పూలమాలలు, హారతులతో ఘనంగా స్వాగతించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత 20ఏళ్లుగా ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని, ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు ఇచ్చిన హామీని ఈరోజు నిలబెట్టుకున్నాని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా గుంతలుపడ్డ రోడ్లను మరమ్మతులు చేయిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి ఎవరు చేస్తున్నారో ప్రజలు గుర్తించాలన్నారు. వేసవిలో కూడా ఏ రైతు తాగు, సాగునీటికి ఇబ్బంది పడకూడదని యుద్ధప్రాతిపదికన గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణాజలాలతో చెరువులు నింపుతున్నట్లు తెలిపారు. హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు చేరుతుండటంతో భూగర్భజలాలు పెరిగి, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి అంటే టీడీపీ టీడీపీ అంటే అభివృద్ధి అన్నారు. అనంతరం కురుబవాండ్లపల్లిలో కృష్ణాజలాలకు మంత్రి సవిత, కూటమి నాయకులు వేద పండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, మునిమడుగు వెంకటరాముడు, మండల కన్వీనర్ సిద్దయ్య, శ్రీరాములు, త్రివేంద్ర, సోమశేఖర్, పోతిరెడ్డి, రామలింగ, రఘువీర, గుట్టూరు సూరీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా వ్యాపారవేత్తగా మారాలి


కుట్టుమిషన్ తొక్కుతూ మహిళలను ఉత్తేజ పరుస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్: ప్రతి మహిళా ఓ వ్యాపారవేత్త కావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండ జీబీసీ కాలనీలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళలను గుర్తించిన పార్టీ టీడీపీ అని అన్నారు. ఆస్తిలో సగభాగం మహిళలకు చెందేలా ఎన్టీఆర్ హక్కు కల్పించారని అన్నారు. అదేతరహాలో సీఎం చంద్రబాబు మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్నారని అన్నారు. ఉచిత టైలరింగ్ శిక్షణ 90 రోజులు ఉంటుందని, శిక్షణ అనంతరం కుట్టుమిషన్ ఉచితంగా అందజేస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, టీడీపీ నాయకులు కేశవయ్య, చిన్నవెంకటరాముడు, గుట్టూరు సూరీ, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బిందు, తుంపర సేద్యం పరికరాల మంజూరు


రైతు అజంతుల్లా పొలంలో డ్రిప్‌ను పరిశీలిస్తున్న పీడీ సుదర్శన్

గోరంట్ల, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలో 298 మంది రైతులకు 456 హెక్టార్లలో సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు మంజూరు చేసినట్లు ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ తెలిపారు. గురువారం మండలంలో రైతులు సబ్సిడీపై వేసుకున్న డ్రిప్, స్ప్రింక్లర్లను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. డ్రిప్ పరికరాల్లో ఐదు ఎకరాలలోపువారికి 90శాతం, ఐదు నుంచి 10 ఎకరాలలోపు 70శాతం, స్ప్రింకర్లు ఐదు ఎకరాల వరకు 55శాతం, 5 నుంచి 12.5 ఎకరాల వరకు 45శాతం సబ్సిడీతో ప్రైవేటు కంపెనీల ద్వారా పరికరాలను సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 2024-25కు గాను జిల్లా వ్యాప్తంగా 1,244 హెక్టార్లలో రైతులకు సబ్సిడీ సౌకర్యం కల్పించామన్నారు. మండలంలోని పులేరు వద్ద రైతు అజంతుల్లా సాగుచేస్తున్న పండ్ల తోటతోపాటు శెట్టిచిన్నంపల్లి, రెడ్డిచెరువు కట్ట తదితర ప్రాంతాల్లో సిగ్నెంట్ కంపెనీ ద్వారా ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలను ఆయన పరిశీలించారు. ఆయనతోపాటు కంపెనీ ప్రతినిధి నాగరాజు, రైతులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


మంటలు ఆర్పడంపై డెమో చూపుతున్న ఫైర్ సిబ్బంది

మడకశిర రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అగ్నిమాపక శాఖ అధికారులు గురువారం అవగాహన కల్పించారు. బుళ్లసముద్రం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదలు జరిగినప్పుడు ఏ విధంగా రక్షించుకోవాలని డెమో ద్వారా విద్యార్థులకు చూపించారు. పాఠశాల హెచ్ఎం విశ్వనాథ్, విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

పెనుకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. గురువారం విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు హర్షవర్దన్, సభ్యులు ఆర్డీఓను కలిశారు. వారు మాట్లాడుతూ పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫిట్నెస్‌లేని బస్సులు నడుపుతూ, కెపాసిటీకి మించి విద్యార్థులను తరలిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు మహేంద్ర, బాబావలి పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీరు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

సోమందేపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాంబాబు కాలనీలో రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్నేళ్లుగా కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు రోడ్లలో ప్రవహిస్తోందని వాపోతున్నారు. రాకపోకలకు అంతరాయంతోపాటు ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నామని అంటున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని అన్నారు. వెంటనే కాలనీలో సమస్యలు పరిష్కరించి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.